సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 28 । అక్టోబర్ । 2023



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 8 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.8.50, సరాసరిన రూ.13.50 ప్రకారం పలికాయి.



జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు వాల్మీకి జయంతి

పుట్టపర్తి టౌన్: రామాయణ మహాకావ్యాన్ని లోకానికి అందించిన వాల్మీకి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. శనివారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఉదయం 9 గంటలకు అధికారిక కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారని అధికారులు తెలిపారు. జిల్లాలోని వాల్మీకులంతా పెద్ద ఎత్తున తరలి వచ్చి జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వాల్మీకి సేవా సమితి జిల్లా అధ్యక్షులు గంగాద్రి పిలుపునిచ్చారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు



అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ పార్సిల్ (కార్గో) సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో డోర్‌డెలివరీకి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 25 వరకు మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, హిందూపురం, కదిరి, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో తొలివిడతగా కార్గో సేవలను ఇంటి వద్దకు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. డోర్ డెలివరీ పార్సిల్ బుక్ చేసేటప్పుడు పార్సిల్ తీసుకునే వారి చిరునామా స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

కృత్రిమ చేతులకు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం రూరల్: మోచేయి నుంచి నాలుగు అంగుళాల చేతుల గల దివ్యాంగులకు రోటరీ క్లబ్ (మంగళగిరి) కృత్రిమ చేతులు పంపిణీ చేయనుందని, అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 7207403150 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు తీసుకున్న అర్హులకు డిసెంబర్ 10న మంగళగిరిలో కృత్రిమ చేతులు పంపిణీ చేస్తారని తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన హెచ్‌ఎం

- విచారణ చేపట్టిన డీవైఈఓ రంగస్వామి



వాతలను చూపుతున్న విద్యార్థి అక్మల్ అహమ్మద్

పరిగి: స్థానిక ఉర్దూ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అక్మల్ అహమ్మద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బాబావలి ఇష్టానుసారంగా చితకొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దసరా సెలవుల అనంతరం విద్యార్థి అక్మల్ శుక్రవారం పాఠశాలకు వెళ్లగా, సెలవుల్లో ఇచ్చిన హోంవర్క్ పూర్తి చేశావా అని హెచ్‌ఎం ప్రశ్నించాడు. అనారోగ్యంతో తాను చేయలేకపోయానని విద్యార్థి చెబుతున్నా...ప్రధానోపాధ్యాయుడు బెల్టుతో ఇష్టానుసారంగా చితకబాదారు. దీంతో విద్యార్థి వీపుపై వాతలు పడ్డాయి. ఆ బాధ భరించలేక మధ్యాహ్న సమయంలో అక్మల్ పాఠశాల నుంచి ఎటో వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి ఇంతియాజ్ పాఠశాలకు వెళ్లి తన కుమారుడు ఎక్కడికెళ్లాడని ప్రధానోపాధ్యాయుడిని నిలదీశాడు. సెలవుల్లో తన కుమారుడు అక్మల్ అనారోగ్యంతో బాధపడ్డాడని, అది చెప్పినా దండించడం ఏమిటని ప్రశ్నించాడు. అనంతరం విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాడు. దీంతో డిప్యూటీ డీవైఈఓ రంగస్వామి మండల ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలంతో కలిసి పాఠశాలకు వచ్చి విద్యార్థి తండ్రి ఇంతియాజ్‌తో పాటూ ఉపాధ్యాయులతో విచారణ చేపట్టారు. ఘటనపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, విద్యార్థిని చితకబాదిన ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, తన కుమారుడిని చితకబాదిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని విద్యార్థి తండ్రి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. విద్యార్థి అక్మల్ అహమ్మద్‌పై హెచ్‌ఎం బాబా ఫక్రోద్దీన్ చితకబాదిన సంఘటన వెనుక కారణాలు వేరే ఉన్నాయని స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రవూఫ్ ఆరోపించారు. వీపుపై వాతలు పడేలా కొట్టిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇక కోతల్లేని కాన్పులు!



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలింత పేరు సుకన్య. లేపాక్షి మండలం కోడిపల్లి. ఈనెల 19న పురిటి నొప్పులతో హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరింది. మరుసటి రోజే వైద్యులు సాధారణ ప్రసవం చేయగా, మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బంది లేదని.. వైద్యులు బాగా చూసుకున్నారని సుకన్య ఆనందంగా చెబుతోంది.



ఈ చిత్రంలో చిన్నారితో ఉన్న మహిళ పేరు సహీనా. ధర్మవరం సాయినగర్. పురిటి నొప్పులతో మూడు రోజుల క్రితం ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరింది. వైద్యులు నార్మల్ డెలివరీ చేశారని, బిడ్డకూ ఎలాంటి ఇబ్బంది లేదని సంతోషంగా చెబుతోంది.

సాక్షి, పుట్టపర్తి



మాతృత్వం మహిళలకు వరం. గర్భం దాల్చినట్లు తెలియగానే వారి కళ్లలో ఆనందం కనిపిస్తుంది. నెలలు నిండే కొద్దీ ఆ స్థానంలో క్రమంగా ఆందోళన చోటు చేసుకుంటుంది. సుఖ ప్రసవం అవుతుందా? లేక సిజేరియన్ చేస్తారా.. అని చాలామంది ఆందోళన చెందుతుంటారు. ఇక నుంచి ఆ చింతకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. షీ–సేఫ్ పేరుతో కత్తెర కాన్పులకు అడ్డుకట్ట వేయనుంది. సుఖప్రసవానికి ప్రాధాన్యం ఇస్తూ అమ్మకు ఆలంబనగా నిలవనుంది.

- 'షీ సేఫ్' విధానంలో సహజ ప్రసవాలకు ప్రాధాన్యం
- గర్భిణులకు అవగాహన కల్పించే దిశగా అడుగులు
- ప్రభుత్వాస్పత్రుల్లో సకల సౌకర్యాలతో ప్రసవాలు
- గుండె, లివర్, రక్తహీనత సమస్యలున్నా కాన్పులు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్‌లపై ప్రత్యేక నిఘా

బిడ్డకు జన్మనివ్వడం పునర్జన్మతో సమానం. అది సహజ పద్ధతిలో జరిగితే తల్లీబిడ్డ క్షేమం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు ధనదాహంతో అమ్మ కడుపును కోసేస్తున్నారు. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా... దోపిడీయే పరమావధిగా సిజేరియన్లు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన ప్రతి గర్భిణీకి పరిస్థితి చేయిదాటుతోందని భయపెడుతూ సిజేరియన్ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 'షీ–సేఫ్'తో సహజ ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చింది. అంతే కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న సిజేరియన్లపై నిఘా పెట్టేలా ఆదేశాలు జారీ చేసింది.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ..

కార్పొరేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ పేరుతో దోపిడీ చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే పరిస్థితి ఉన్నా.. కోత వేసి శిశువులను బయటికి తీస్తున్నారు. రోగి పరిస్థితి సీరియస్‌గా ఉందని చెప్పి.. భయాందోళనకు గురి చేసి భారీగా డబ్బులు లాగుతున్నారు. దీనికి తోడు చాలామంది సెంటిమెంట్లను నమ్మి.. ఫలానా తేదీ రోజున.. సమయం.. నిమిషాల లెక్కగట్టి బిడ్డను అమ్మ కడుపులోంచి బయటకు తేవాలని చెబుతుండగా...ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు వీటిని క్యాష్ చేసుకుంటున్నాయి. అడిగిన సమయానికే సిజేరియన్ చేసి పిల్లలను చేతిలో పెడుతున్నాయి.

ఆపరేషన్ల కుదింపుపై ప్రత్యేక దృష్టి..

జిల్లాలో 47 పీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, మూడు ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి, 167 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ప్రసవాలకోసం ప్రభుత్వాస్పత్రుల్లో చేరుతున్న వారిలో 80 శాతం మందికి సాధారణ కాన్పు చేసి పంపుతున్నారు. గత ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ప్రభుత్వాస్పత్రుల్లో 2,834 ప్రసవాలు జరగ్గా.. అందులో 637 మందికి మాత్రమే సిజేరియన్ చేశారు. అనారోగ్య సమస్య ఉన్న వారికి సిజేరియన్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

సహజ ప్రసవానికీ.. సిజేరియన్‌కూ తేడాలివే..

- సాధారణ కాన్పయితే మహిళలు ఆరోగ్యంగా ఉంటారు.
- కాన్పు జరిగిన రెండో రోజు నుంచే పనులు చేసుకుంటారు.
- పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది.
- శస్త్రచికిత్స ద్వారా బిడ్డకు జన్మనిస్తే మహిళ శారీరక పరిస్థితి ఆధారంగా రెండు వారాల వరకు విశ్రాంతి అవసరం.
- ప్రసవ సమయంలో 9 నెలలు పూర్తయినా కొందరు గర్భిణులకు పురిటి నొప్పులు రావు. ఇలాంటి సందర్భంలోనే శస్త్రచికిత్స చేస్తుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న వైద్యులు సిజేరియన్‌లను ప్రోత్సహిస్తున్నారు.

'షీ-సేఫ్'కు సన్నద్ధం



అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలన్నదే షీ-సేఫ్ ఉద్దేశం. దీనిపై వైద్యులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తాం. సిజేరియన్ విధానాలతో మాతా శిశుమరణాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఆపరేషన్ చేసే సమయంలో అత్యంత సురక్షిత పద్ధతులు పాటించాలని సూచిస్తాం. – ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

వైద్యుల సలహాలు తీసుకోవాలి



గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి. అలాగే మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. రక్తహీనత లోపమే మాతాశిశు మరణాలు, ఆపరేషన్లకు కారణం అవుతోంది. అనవసర సిజేరియన్లు నియంత్రించడంపై దృష్టి సారిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లను నియంత్రించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. – డాక్టర్ పద్మలత, గైనకాలజిస్టు, ధర్మవరం ఆస్పత్రి

అత్యవసరంలోనే సిజేరియన్



ప్రభుత్వాస్పత్రుల్లో వీలైనంత వరకు సాధారణ ప్రసవం చేసేందుకే ప్రయత్నిస్తాం. ఆస్పత్రికి వచ్చే కేసుల్లో 50 శాతం బీపీ, రక్తహీనతతో బాధపడేవారే. అలాంటి వారికి కూడా ఆస్పత్రుల్లో సుఖ ప్రసవం జరిగేలా చూస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేస్తున్నాం.
– డాక్టర్ నీరజ, గైనకాలజిస్టు, హిందూపురం జిల్లా ఆస్పత్రి

'మూర్ఛ' భరించలేక మెడికో ఆత్మహత్య

- మృతుడు హిందూపురం రూరల్ సీఐ కుమారుడు



ఆర్‌ఎన్ సూర్య మృతదేహం

హిందూపురం అర్బన్: తరచూ ఇబ్బంది పెడుతున్న మూర్ఛవ్యాధి భరించలేక ఓ మెడికో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే...హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ డీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు ఆర్‌ఎన్.సూర్య చంద్ర(22) కుప్పంలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మూర్ఛవ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబీకులు హిందూపురం తీసుకువచ్చి బెంగళూరులో చికిత్స చేయిస్తున్నారు. అయినప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో శుక్రవారం ఉదయం ఇంట్లోని తన గదిలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే సూర్యచంద్ర మృతి చెందినట్లు తెలిపారు. మూర్ఛవ్యాధితో కలిగే ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం కర్నూలుకు తీసుకెళ్లారు.

రూ.5 లక్షల చొప్పున పరిహారం

- రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన జగన్ సర్కార్

పెనుకొండ: కర్ణాటక రాష్ట్రం చిక్‌బళాపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 5 లక్షల పరిహారం ప్రకటించినట్లు పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ తెలిపారు. అలాగే బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని వెల్లడించారు. శుక్రవారం ఆయన పెనుకొండలో విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. మృతులంతా నిరుపేదలని, కుటుంబాలకు ఆధారంగా ఉన్నవారేనన్నారు. అందువల్లే బాధిత కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సీఎం జగన్ ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని, త్వరలోనే కలెక్టర్ అరుణ్‌బాబు ద్వారా చెక్కులు అందజేస్తామన్నారు.

రబీకి విత్తన వేరుశనగ సిద్ధం చేయండి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: రబీలో వేరుశనగ సాగుచేసే రైతులకు అవసరమైన విత్తనం సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో పంటల సాగు అంతంతమాత్రంగానే సాగిందన్నారు. అందువల్ల రబీలో సాగు చేయడానికి అవసరమైన వేరుశగ కాయలను సబ్సిడీ ధరలతో అందించాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాలని తీర్మానం చేశారు. అలాగే లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి రైతుల పొలాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఇక జిల్లాలో విస్తారంగా సగవుతున్న రాగికి గిట్టు బాటు ధర మరింత పెంచి రైతులను ఆదుకోవాలన్నారు. మొక్కజొన్నకు సైతం సబ్సిడీ పెంచాలన్నారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు విత్తన ప్యాకెట్లతో పాటు డ్రమ్ములు, టార్పాలిన్లు అందజేయాలన్నారు. రైతు బజార్ కోసం పుట్టపర్తిలో స్థల సేకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల భవనాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్వింటా రాగులు రూ.3,800..

జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... రాగులు పండించిన రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వమే క్వింటా రూ.3,800 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. దీనిగురించి రైతులందరికీ తెలియజెప్పేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేయడానికి అవసరమైన రాగులను రైతుల నుంచే కొనుగోలు చేస్తారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ... ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదు వంద శాతం పూర్తయిందన్నారు. ముసాయిదా జాబితాలను జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే ప్రదర్శనకు ఉంచామన్నారు. అభ్యంతరాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా స్వీకరిస్తున్నామన్నారు. ఇక ఈ-కేవైసీ 98 శాతం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, డీఈ మోసెస్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహమూర్తి, పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వర్థనాయక్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 13,67,110

- ముసాయిదా జాబితా విడుదల చేసిన కలెక్టర్
- మార్పులు, చేర్పులకు డిసెంబర్ 9 వరకూ అవకాశం



మొత్తం ఓటర్లు	13,67,110
పురుష ఓటర్లు	6,85,239
మహిళా ఓటర్లు	6,81,810
ఇతరులు	61

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు విడుదల చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్వో కొండయ్యతో కలిసి వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 13,67,110 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 6,85,239 మంది, మహిళా ఓటర్లు 6,81,810 మంది, ఇతరులు 61 మంది ఉన్నట్లు వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, పేర్లు తొలగించినా ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను తెలియజేయవచ్చన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈఆర్‌ఓలు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను ప్రదర్శించాలన్నారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకూ ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, క్లెయింలు తెలియజేయాలన్నారు. 2024 జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు

నవంబర్ 10 వరకూ ఈవీఎంల పరిశీలన..

ధర్మవరం మార్కెట్ యార్డులో ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలనకు వెళ్లాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా 'బెల్' ఇంజినీర్లు నివృత్తి చేస్తారన్నారు. నవంబర్ 10వ తేదీ వరకూ ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల డీటీ మైనుద్దీన్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి రంగారెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి మనోహర్ నాయుడు, సీపీఎం నాయకుడు ఇంతియాజ్, సీపీఐ నేత వేమయ్య, టీడీపీ నేత రామాంజనేయులు, జనసేన నాయకుడు అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు విరివిగా రుణాలివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలి
- డీఎల్‌ఆర్సీలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: వివిధ పథకాల్లో అర్హులైన వారికి విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో జిల్లా స్థాయి రివ్యూ కమిటీ(డీఎల్‌ఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు త్వరితగతిన చేరుకోవాలన్నారు. పరిశ్రమల శాఖ, వ్యవసాయ, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖలతో అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. ఆయా పథకాల కింద కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా జగనన్న తోడు, జగనన్న సురక్ష, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సీసీఆర్సీ లోన్లు, ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధిపై సమీక్షించారు. పథకాలపై గ్రామాల్లో ప్రచారం నిర్వహించి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. 'జగనన్న తోడు' కింద 8వ విడతలో డిసెంబర్ 31 నాటికి జిల్లాలోని అర్హులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు.

కౌలు రైతులకూ రుణాలివ్వాలి..

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10,295 మందికి వివిధ బ్యాంకులు రుణాలు అందజేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే జగనన్న తోడు పథకంలో అర్హులైన 4,831 మందికి రుణాలు మంజూరు చేయాలన్నారు. సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకూ పంటల సాగు కోసం రుణాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రజలకు విరివిగా రుణాలు అందించడానికి గ్రామాల్లో క్యాంపులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 31 నాటికి జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పథకంపై 100 శాతం రుణాలు అందజేసే విధంగా బ్యాంకు మేనేజర్లు చర్యలు చేపట్టాలన్నారు. నేషనల లైవ్ స్టాక్ మిషన్ కింద 50 శాతం సబ్సిడీపై గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకం యూనిట్లపై అవగాహన కల్పించి ప్రోత్సహించడానికి అర్హులైన వారికి బ్యాంకర్లు ఆర్థిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, నాబార్డు ప్రతినిధి అనురాధ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, డిక్కీ, ఫిక్కీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పలువురు బదిలీ

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని పలువురు ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలికిరిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎస్.దేవన్నను అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. పులివెందుల నుంచి జీఎస్ఎస్.రాజు జేఎన్‌టీయూ(అనంతపురం) అడిషనల్ కంట్రోలర్‌గా బదిలీ అయ్యారు. పరీక్షల విభాగం నుంచి కె.జయలక్ష్మిని జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు, కలికిరి ప్రొఫెసర్ నాగప్రసాదనాయుడును అక్కడే మెకానికల్ విభాగాధిపతిగా బదిలీ చేశారు. కలికిరి అసిస్టెంట్ ప్రొఫెసర్ డీఆర్ శ్రీనివాస్‌ను జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. ఓటీపీఆర్ఐ ఫుడ్‌టెక్నాలజీ ప్రొఫెసర్ ఎ.స్వరూపరాణి అక్కడే విభాగాధిపతిగా బదిలీ అయ్యారు. ప్రొఫెసర్ ఎ.పి.శివకుమార్‌ను యూనివర్సిటీ ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావును కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. కలికిరి ప్రిన్సిపాల్ ఎస్.వైశాలిని జేఎన్‌టీయూ(ఏ) ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ డైరెక్టర్‌గా, ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డిని పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఆర్.వసుంధరను జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు.

'సురక్ష'తో ప్రజల చెంతకే వైద్యం



ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరంలో వృద్ధురాలికి హెల్త్ కిట్ అందజేస్తున్న దృశ్యం

- శుక్రవారం జిల్లాలోని 7 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- 2,190 మందికి ఓపీ సేవలు అందించిన వైద్యులు

ప్రశాంతి నిలయం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ప్రజల చెంతకే వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం జిల్లాలోని 7 వైఎస్సార్ విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. 2,190 మందికి ఓపీ సేవలు అందించారు. మరో 723 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన 188 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాల్లో 27 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 12 మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని సేవలందించారు.

నేడు 12 ప్రాంతాల్లో సురక్ష శిబిరాలు..

శనివారం జిల్లాలోని 12 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. బత్తలపల్లి మండలం సంజీవపురం, తలుపుల మండల ఉదుములకుర్తి, బుక్కపట్నం మండలం కొత్తకోట, కొత్తచెరువు మండలం కొత్తచెరువు-3 సచివాలయం, గుడిబండ మండలం గునేమోరుబాగల్, గోరంట్ల మండలం ఈ.గంగంపల్లి, సోమందేపల్లి మండలం తుంగోడు, హిందూపురం మండలం కిరికెర-1 సచివాలయం, చిలమత్తూరు మండలం చాగలేరు, ధర్మవరం మండలం లింగశెట్టి పాళ్యం, ధర్మవరం అర్బన్ పరిధిలో శివనగర్, హిందూపురం అర్బన్ పరిధిలోని లక్ష్మీపురంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రశాంతి నిలయం: విద్యార్థులు, యువతలో ఖాదీ వాడకంపై అవగాహన పెంపొందించేందుకు ''ఖాదీ ఫర్ నేషన్ – ఖాదీ ఫర్ ఫ్యాషన్''అన్న నినాదంతో ఖాదీ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 31 వరకూ అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి కేటగిరి కింద 6 నుంచి 10వ తరగతి, రెండో కేటగిరి కింద ఇంటర్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖాదీ ప్రాముఖ్యతకు సంబంధించిన అంశాలపై పోటీలుంటాయన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

- కలెక్టర్ అరుణ్‌బాబు

ఓబుళదేవరచెరువు: గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీఐలో మండలస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి 192 దరఖాస్తులు రాగా రెవెన్యూ, హౌసింగ్‌కు సంబంధించినవే అత్యధికంగా ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. కర్ణాటక రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, త్వరలోనే ఈ పరిహారాన్ని వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ వరలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పర్వీన్‌భాను, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్‌బాషా, మండల అగ్రి బోర్డు కమిటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచులు గోవిందు, జగన్మోహన్‌చౌదరి, బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎస్ఎస్ఏ ఈఈగా శంకరయ్య

అనంతపురం సిటీ: సర్వశిక్షాభియాన్ (ఎస్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా శంకరయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం పంచాయతీరాజ్‌శాఖ కళ్యాణదుర్గం డీఈఈగా పని చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్ఎస్ఏ పూర్తి అదనపు బాధ్యతలతో ఈఈగా నియమితులైన శంకరయ్య.. అనంతపురం జిల్లాలోనూ అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.


శంకరయ్య

సర్దుబాటులో లోపాలు సరిదిద్దండి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

ప్రశాంతి నిలయం: ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో చోటు చేసుకున్న లోపాలను సరిచేయాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు డీఈఓ మీనాక్షిని కోరారు. ఈమేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, పీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను వారు డీఈఓకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జంషీర్, ప్రతాప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శంకర్ నాయక్, భాస్కర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్‌పై దాడితో నాకు సంబంధం లేదు

- ఎమ్మెల్యే శంకరనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: 'ఈసీమ దినపత్రిక ' నిర్వాహకుడు గోరంట్లకు చెందిన ఈశ్వర్‌పై జరిగిన దాడితో తనకెలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈశ్వర్‌పై దాడి ఘటనను కుటుంబ సభ్యులు తనకు ఆపాదిస్తున్నారని, అయితే అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కొందరు ఈశ్వర్ కుటుంబీకులను ఉసిగొలిపి తనపై ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. గతంలో ఈశ్వర్‌కు గోరంట్ల మండలం పులేరుకు చెందిన స్టోర్‌డీలర్ మధ్య వివాదం జరిగిందని, వారు ఘర్షణ కూడా పడ్డారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నదే తమ అభిమతమన్నారు. ఈశ్వర్‌పై దాడి ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కత్తితో దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మన్సూర్

కదిరి టౌన్: మండల పరిధిలోని పట్నం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బట్టిపాటి అశోక్ అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మన్సూర్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. పట్టణ ఎస్ఐ మగ్బుల్ బాషా వివరాలమేరకు... పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ర్యాలీగా వెళ్తున్నారు. టౌయిగ్రాండ్ వద్ద టీడీపీ కార్యకర్త అశోక్ తన ద్విచక్ర వాహనాన్ని ఉద్దేశ పూర్వకంగా మన్సూర్ ఆటోకు అడ్డు పెట్టాడు. ఆటోడ్రైవర్ మన్సూర్ వాహనాన్ని అడ్డు తీయమని చెప్పడంతో అశోక్ ముందుగానే తెచ్చుకున్న కత్తితో మన్సూర్‌పై దాడి చేశాడు. గాయలు కావడంతో వెంటనే అతన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అశోక్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవంబర్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నవంబర్ 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.నరసింహారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, టోర్నమెంట్ డైరెక్టర్ ఏ. ఉదయ్‌కుమార్‌నాయుడు, టోర్నమెంట్ స్పాన్సర్ రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 210 మంది చెస్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆరు నుంచి 16 సంవత్సరాల వయస్సు వరకు అండర్-6 , అండర్- 8, అండర్-10, అండర్-12, అండర్-14, అండర్-16 విభాగాల్లో బాల, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నవంబర్ 15వ తేదీలోపు www.apchess.org అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న పోలీసు అమరవీరుల వారోత్సవాలు


వ్యాసరచన పోటీని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పోలీస్ కార్యాలయం సమీపంలో ఉన్న స్నేహప్రియ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో సమాజం పాత్ర ' అన్న అంశంపై పోటీలు జరపగా గెలుపొందిన వారికి పోలీసుల అమరవీరుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నారు. అడిషనల్ ఎస్పీ విష్ణు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాలు కొనసాగుతున్నాయన్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే డీఎస్పీ వాసుదేవన్, సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలో ఉన్న పుట్టపర్తి, ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐ టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కొడుకుపై వేటకొడవళ్లతో దాడి


దాడిలో గాయపడిన మంగళ గౌరమ్మ, మారుతి

అగళి: మండల పరిధిలోని పి బ్యాడిగెర సమీపంలో ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనంలో వస్తున్న తల్లీ కొడుకుపై దుండగులు వేటకొడవళ్లతో దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. మంగళ గౌరమ్మ , ఆమె కుమారుడు మారుతి మధుడి పంచాయతీ గొళ్లహట్టి గ్రామానికి చెందిన వారు. అయితే బంధువులను చూడటానికి ద్విచక్ర వాహనంలో కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కట్కేనపల్లి వెళ్లారు. తిరిగి గురువారం స్వగ్రామానికి బయలు దేరారు. పి బ్యాడిగెర సమీపంలోకి రాగానే కారులో వచ్చిన కొందరు వారి వాహనాన్ని అడ్డుకొని వేటకొడవళ్లతో వారిపై దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం తుమకూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇద్దరు బాలికల అదృశ్యం


నందినిబాయి


సంజన

కదిరి టౌన్: మండలానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. ఎస్ఐ వెంకట సుబ్బయ్య వివరాలమేరకు... కదిరి మండలం సున్నపుగుట్ట తండా గ్రామానికి చెందిన సురేష్ నాయక్ కుమార్తె నందినిబాయి (16) వాల్మీకి పాఠశాల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమె పిన్ని కూతురు సంజన (15)తో కలసి పట్టణంలో చౌక్ బజారులో పూలు కొనేందుకు వచ్చి కనిపించకుండా పోయారు. నందినిబాయి తల్లి కళావతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ సుబ్బరాయుడు

గోరంట్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని గోరంట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలమేరకు... తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా ఉండవల్లి మండలం బొంకూరుకు చెందిన వడ్డే ప్రతాప్ కారు (ఏపీ02సీసీ4969)లో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు పక్కాగా సమాచారం అందిందన్నారు. గురువారం రాత్రి పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేయగా ప్రతాప్ అక్రమ మద్యంతో పట్టుబడినట్లు పేర్కొన్నారు. 50 బాక్సుల టెట్రా ప్యాకెట్ల (4,800)తో పాటు కారును సీజ్ చేశామన్నారు. నిందితుడిని శుక్రవారం పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.